నేడు 26 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కడప : భూ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల మూడవ తేదీ శుక్రవారం జిల్లాలో 26 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ లోని అట్లూరు మండలం ముత్తుకూరు, బి. కోడూరు మండలం తంగెడుపల్లి, బి.మఠం మండలం నాగిశెట్టిపల్లె, కలసపాడు మండలం ఎగువ తంబాళ్లపల్లె, ఎస్ ఏ కె ఎన్ మండలం అక్కంపేట, పోరుమామిల్ల మండలంలో పోరుమామిల్ల , పులివెందుల రెవిన్యూ డివిజన్‌లోని చక్రాయపేట మండలం చక్రాయపేట, తొండూరు మండలం భద్రంపల్లి, లింగాల మండలం నరసింగరావు పల్లె, సింహాద్రిపురం మండలం హిమకుంట, పులివెందుల మండలం రాచు మర్రిపల్లిలో తదితర గ్రామాల్లో నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని డిఆర్ఒ కోరారు.

ప్రజలపై 'స్మార్ట్' భారం

- ఆందోళనలో వినియోగదారులు
- పరిశ్రమలపై మరింత ప్రభావం

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

డిజిటల్ మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు బిగింపు కొనసాగుతోంది. త్వరలో సెల్ఫోన్ బిల్లుల లాగా విద్యుత్ బిల్లులు కూడా ప్రీపెయిడ్ రూపంలో రానున్నాయి. దీని ద్వారా తమపై స్మార్ట్ మీటర్ల భారం పడనుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును వామపక్షాలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. ఇందులో పారదర్శకత అనేది లేకుండా పోతుందని వారు అంటున్నారు. ముందుగా డిపాజిట్లు చెల్లించి మీటర్లు తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ ప్రీపెయిడ్ రూపంలో డిపాజిట్లు ముందస్తుగా చెల్లించాలనా? అని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల వినియోగంపై నాలుగు అంశాలను ప్రస్తావించింది. విద్యుత్ సరఫరాలో విభజించే క్రమంలో వచ్చేటువంటి నష్టాన్ని తగ్గిస్తుందని తెలిపింది. టైం ప్రకారం విద్యుత్ వాడకాన్ని బట్టి రేటును తీసుకుంటుందని తెలిపారు. డిజిటల్ ప్రీపెయిడ్ సిస్టంను ఈ మీటర్లలో పొందుపరిచినట్లు తెలిపింది. టైం ప్రకారం రేటు అంటే ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు నార్మల్ రేటు కంటే ఎక్కువ రేటు పడుతుంది. మిగతా సమయాలలో మామూలు రేటు పడుతుంది. గతంలో యంత్రపు మీటర్లు ఉండేవి వాటిలో ఖచ్చితత్వం లేదని వాటి స్థానంలో డిజిటల్ మీటర్లు బిగించారు. ఇప్పుడు డిజిటల్ మీటర్లలో ఖచ్చితత్వం లేదని వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం మీటర్ల మార్పు ప్రక్రియను ప్రయివేట్ సంస్థలకు కాంట్రాక్ట్‌ను అప్పగించింది. మండల వ్యాప్తంగా పాత మీటర్లు తొలగించి వాటి స్థానంలో కొత్త స్మార్ట్ మీటర్లను బిగించుచున్నారు. ఆదానికి చెందిన సంస్థ ఈ కాంట్రాక్ట్ తీసుకున్నట్లు సమాచారం. వచ్చే మూడు నెలల్లో ప్రీపెయిడ్ బిల్లులతో మీటర్లు పనిచేస్తాయి అని అంటున్నారు. స్మార్ట్ మీటర్లకు సంబంధించి ఏదైనా రిపేర్లు వచ్చిన సంబంధమైన కాంట్రాక్టు వ్యక్తులే చేస్తారని విద్యుత్ అధికారులు అంటున్నారు.

ప్రభుత్వమే తక్కువ ధరకు అందించాలి

ప్రస్తుతం పేపర్ బిల్లు ఇవ్వడం ద్వారా దేనికి ఎంత బిల్లు వస్తుందనేది తెలుస్తుండేది. కానీ స్మార్ట్ మీటర్లలో ఎలా తెలుస్తుంది? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలపై భారం పడనుంది. ప్రభుత్వం ప్రజలకు అవసరమైన విద్యుత్తును విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను స్థాపించి తయారు చేయడం వల్ల తక్కువ ధర పడుతుంది. ప్రయివేట్ సంస్థలతో విద్యుత్‌ను వారు చెప్పిన ధరకు కొనాల్సి వస్తుంది. ఈ క్రమంలో వినియోగదారునికి భారం పడుతుంది. తక్కువ ధరకు విద్యుత్తు ప్రజలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- వి.అన్వేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు.

ఒకే రేటు నిర్ణయించాలి

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నాం.స్మార్ట్ మీటర్ల ధర చాలా ఎక్కువ. ఆ భారం ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలి. విద్యుత్ సంస్థలనే ప్రయివేటీకరించేలా స్మార్ట్ మీటర్ల వ్యవహారం సాగుతోంది. ఇప్పుడు ప్రీపెయిడ్ అంటే ముందుగా చెల్లించిన డిపాజిట్లు వినియోగదారులకు ఎలా వస్తాయో అర్థం కావడం లేదు. ఉదయం ఒక రేటు, మధ్యాహ్నం ఒకరేటు ఇలా కాకుండా ఒకటే రేటును ప్రభుత్వం కేటాయించాలి. ప్రయివేట్ సంస్థలకు అప్పగించకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి.

- వీరనాల శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నాం..స్మార్ట్ మీటర్ల ద్వారా చాలా నష్టపోతాం. ఉపాధి కోసం పాలిష్ మిషన్‌ను నడుపుకుంటున్నాను. ఈ మధ్యకాలంలో ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. తయారైన రాయి రేటు విలువ తగ్గిపోయింది. రాయిని కొనేవారు కరువయ్యారు. ఈ క్రమంలో స్మార్ట్ మీటర్లు అంటూ ఇది ఒక బరువు అదనంగా మా నెత్తిన పడుతోంది. ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు అంటూ, బిల్లులు అధికంగా వస్తున్నాయి. ఇంకా స్మార్ట్ మీటర్లు అయితే ఏ ఛార్జీలు పడతాయో కూడా అర్థం కాదు. ప్రభుత్వాలు తమకు ఏ రకంగానూ సహకరించడం లేదు. విద్యుత్ బిల్లులు తగ్గించాలి.

- సి.సోమశేఖర్‌రెడ్డి, పాలిష్ మిషన్ ఓనర్

డిపాజిట్లు వెనక్కి ఇవ్వాలి

స్మార్ట్ మీటర్లు వస్తే మేము కట్టిన డిపాజిట్లు మాకు వెనక్కి ఇవ్వాలి. ముందుగా డిపాజిట్ కట్టించుకొని మాకు డిజిటల్ మీటర్లు బిగించారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లకు చిప్‌లో ముందుగానే డబ్బులు వేసుకోవాలని అంటున్నారు. అయితే మేము కట్టిన డిపాజిట్లు ఎలా వస్తాయి. విద్యుత్ చార్జీలు తగ్గించాలని మేము కోరుతుంటే మాపై స్మార్ట్ మీటర్లు అంటూ ప్రభుత్వం అదనపు భారం వేయడం సరికాదు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లు బాగా పనిచేస్తున్నాయి. కరెంట్ బిల్లులు కూడా కరెక్ట్‌గా ప్రతినెలా కడుతున్నాం. వ్యాపారాలు లేవు. లాభాలు లేవు. కేవలం కార్మికులకు ఉపాధి చూపడం కోసమే మాత్రమే వ్యాపారం చేస్తున్నాం. నిరుద్యోగులమైన మాకు ఎటువంటి ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. రాయల్టీ పేరుతో డబ్బులు కడుతున్నాం. ఆ రాయల్టీని తగ్గించమని అనేకసార్లు మొరపెట్టుకున్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదు.

- సుదర్శన్‌రెడ్డి, పాలిష్ మిషన్ ఓనర్

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

ప్రజాశక్తి-జమ్మలమడుగు/కడప/చింతకొమ్మదిన్నె

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి మహిళా ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. ఆకాంక్ష జిల్లా, బ్లాకుల అభివృద్ధి పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చిన ఆయన గురువారం జమ్మలమడుగు మండలం మోరగుడి ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత సాధనకు కృషి చేస్తోందన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి ఒక్కరూ ఎదో ఒక రంగంలో స్వయం ఉపాధిని పొందుతున్నారంటే జిల్లా యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందని అందుకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రాథమిక సెక్టారులోని వ్యవసాయం, ఇండస్ట్రియల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. మోరగుడి ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కిచెన్ నిర్మాణం కోసం శిలాఫలకాన్ని కేంద్రమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఎస్ పంకజ్ దీక్షిత్, పిఐబి డైరెక్టర్ నంద కిషోర్‌రెడ్డి, ఆర్‌డిఒ సాయిశ్రీ, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, అదిశేషారెడ్డి పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో బ్లాకుల అభివృద్ధి : కలెక్టర్

ఆకాంక్ష జిల్లాలోని బ్లాకుల అభివృద్ధిని చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నామని కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన ఆకాంక్ష జిల్లా, బ్లాకుల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎకనామి, ప్రైమరీ సెక్టార్ కింద వ్యవసాయ వాటి అనుబంధ శాఖలు, సెకండరీ సెక్టార్ కింద పరిశ్రమలు, విజన్ యాక్షన్ ప్లాన్ 2024-29, టూరిజం, ఆస్పిరేషన్ డిస్టిక్ ప్రోగ్రాం కింద హెల్త్ న్యూట్రిషన్, విద్య, వ్యవసాయం, జలవనరులు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జమ్మలమడుగు, కమలాపురం ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కృష్ణ చైతన్యరెడ్డి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, వ్యవసాయ, ఉద్యాన, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు నాగేశ్వరరావు, సుభాషిని, డాక్టర్ నాగరాజు, డిఇఒ మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద నాయక్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు. అనంతరం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను మందుల స్టాక్, ఒపి నమోదు సంఖ్య తదితర వివరాలను ఆరోగ్యశాఖ అధికారులను అడిగి కేంద్ర మంత్రి తెలుసుకున్నారు. బుగ్గలపల్లి ఎస్‌సి కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు, పసిపిల్లల పోసినపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ ఉమా మహేశ్వర్ కుమార్, డాక్టర్ నాగశశి భూషణ్‌రెడ్డి, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, డిప్యూటీ డెమో రమణమ్మ, కుమారి మాణిక్యమ్మ, తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఒ కుళాయి బాబు, స్థానిక వైద్యాధికారులు రాఘవేంద్ర, సునీత పాల్గొన్నారు.

సెంట్రల్ కిచెన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి

హామీలు అమలు చేయాలి

4, 5వ తేదీల్లో సిపిఎం జిల్లా మహాసభలు
సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి- కడప అర్బన్

సిపిఎం జిల్లా 12 వ మహాసభలు ఈనెల 4, 5 తేదీల్లో నగరంలో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల విజయవంతానికి నగర ప్రజానీకం సహకరించాలని ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ విజ్ఞప్తి చేశారు. గురువారం నగరంలోని మృత్యుంజకుంటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న ఉదయం 10 గంటలకు కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న జియాన్ కళాశాల నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రదర్శన కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, రైతు బజార్ మీదుగా ఐటిఐ సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఐటిఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. బహిరంగ సభ అనంతరం బిల్డప్ వద్ద వున్న అజ్మత్ ఫంక్షన్ హాల్‌లో 4వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ప్రతినిధుల సభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రతినిధుల సభలో జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, రైతాంగ సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, భూసమస్య, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళారంగ సమస్యల మీద ఈ మహాసభలో తీర్మానాలు చేయనున్నారని చెప్పారు. వీటితోపాటు విద్యుత్ చార్జీల భారాలు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, విద్య, వైద్యం, ఉపాధి తదితర అంశాల మీద చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మహాసభల ముగింపు సందర్భంగా రానున్న కాలంలో సిపిఎం చేయాల్సిన పోరాటాల మీద కార్యక్రమం రూపకల్ప చేస్తారని చెప్పారు. మహాసభల విజయవంతానికి జిల్లా ప్రజానీకం సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, శివకుమార్, చిన్ని పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

నేడు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఈనెల 3న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ లో జిల్లా సైన్స్ ఆఫీసర్ యబనైజర్ ఇమ్మానుయేల్, కడప మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలను ఉపాధ్యాయులందరూ సమిష్టి కృషితో సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని సూచించారు. వైఎస్ఆర్ జిల్లాలోని 36 మండలాల నుంచి వ్యక్తిగత విభాగంలో 36, గ్రూపు విభాగంలో 36, ఉపాధ్యాయ విభాగంలో 36 చొప్పున సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శించబడతాయని పేర్కొన్నారు. ఇందులో ఉత్తమ ప్రాజెక్టులను ప్రతి విభాగంలో రెండు ఎంపిక చేయబడుతుందని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ, ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యార్థుల సందర్శన వంటి కార్యక్రమాలతో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దశరథరామిరెడ్డి, కేశవరెడ్డి, నిత్యానంద రెడ్డి, గంగాధర్, కృష్ణ కిషోర్, విజయ ప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

వైవీయూకు ఎఫ్ఎస్ఎస్ఎఐ సర్టిఫికెట్

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగి వేమన యూనివర్సిటీ వసతి గృహాలలో నాణ్యమైన భోజన, ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇస్తున్నట్లు గుర్తించి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ కృష్ణారెడ్డి, వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ సమక్షంలో కళాశాల ప్రిన్సిపల్, వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రూకో ప్రాజెక్ట్ హెడ్ అల్లూరి సంపత్ కుమార్ సర్టిఫికెట్‌ను గురువారం అందజేశారు. విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పెన్నా, పాపాగ్ని, చిత్రావతి, చెయ్యేరు మెస్‌లకు ఎఫ్ఎస్ఎస్ఎఐ సర్టిఫికెట్ రావడం సంతోషదాయకమన్నారు. చీఫ్ వార్డెన్, వసతి గృహ సంక్షేమ అధికారులు మరింత దృష్టి సారించాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య పద్మ మాట్లాడుతూ వసతి గృహ అవసరాలు తెలియజేస్తే సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి, ఐ క్యు ఎసి డైరెక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, సహాయ డైరెక్టర్ సుబోష్ చంద్ర, పిఅర్ సెల్ సంచాలకులు డాక్టర్ పి.సరిత, వార్డెన్లు డాక్టర్ సతీష్ బాబు, డాక్టర్ జిల్లెల్ల మెరిసి విజేత, డాక్టర్ సునీత, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ రామ మనోహర్ రెడ్డి, డాక్టర్ వర ప్రభాకర్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇంటాక్ కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచంలోనే రెండవస్థానంలో ఉన్న అద్భుతమైన గండికోట లాంటి ఘనమైన వారసత్వ సంపద విశిష్ఠతను జాతీయ స్థాయికి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేసి గుర్తింపు, గౌరవం కల్పిస్తున్న ఇంటాక్ కడప చాప్టర్ కృషి ప్రశంసనీయమైందని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. గురువారం భారత జాతీయ కళా సంస్కృతి, వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్), లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, పోతుల చిన్న కంచమ్మ, చిన్న ఓబుళరెడ్డి, సరస్వతమ్మ స్మారక ట్రస్టుల ఉమ్మడి ఆధ్వర్యంలో నగరానికి చెందిన మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైవీయూ విసి మాట్లాడారు. ఈ సంవత్సరంలో తాము చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాల గురించి సభ్యులు అతిథులకు వివరించారు. కార్యక్రమంలో సంస్థ కో -కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ సంస్థ అధ్యక్షులు అనంతంబొట్ల వెంకట సుబ్బయ్య, పూర్వ అధ్యక్షులు లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి, సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి కృష్ణారెడ్డి

ఐసిడిఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా గౌరవ అధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : కోర్టు ఆర్డర్‌ను ఖాతరు చేయని ఐసిడిఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ కోరారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల ప్రాజెక్టు సింహాద్రిపురం సెక్టార్ హిమకుంటలో సరస్వతి అనే వర్కర్‌ను అన్యాయంగా తొలగించారని కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. విచారణ అనంతరం కోర్టు విధుల్లోకి తీసుకోవాలని ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఆ ఆర్డర్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. కొందరు అధికారులు, రాజకీయ నాయకులు కలిసి అన్యాయంగా వర్కర్‌ను తొలగించడం దుర్మార్గమని చెప్పారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణితో వెంట వెంటనే మెమోలిచ్చి మానసికంగా తీవ్ర ఇబ్బందులు గురి చేసి తొలగించారని తెలిపారు. ఇచ్చిన ఆర్డర్‌ను ఐసిడిఎస్ జిల్లా అధికారులు ఖాతర్ చేయడం అన్యాయమని చెప్పారు. కోర్టు ఆర్డర్ అమలు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్‌కు వారి కుటుంబానికి ఏమి జరిగినా ఐసిడిఎస్ పిడి, పులివెందుల సిడిపిఒ దే బాధ్యతన్నారు. సమాశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్.లక్ష్మీదేవి సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిత్య పూజయ్య ఏజెన్సీ ప్రారంభం

ప్రజాశక్తి- వల్లూరు

కడప - తాడిపత్రి జాతీయ రహదారి గణేష్ పురం వద్ద శ్రీనిత్య పూజయ్య స్వామి ఏజెన్సీని కమలాపురం నియోజవర్గం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి గురువారం ప్రారంభించారు. శ్రీనిత్య పూజయ్య స్వామి ఏజెన్సీ ప్రొప్రైటర్స్ పి.నాగ సుబ్బారెడ్డి, కె.నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో షాపు రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్త నర్సింహారెడ్డి, నియోజవర్గం టిడిపి యువ నాయకులు పుత్తా లక్ష్మీరెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. నిత్య పూజయ్య స్వామి ఏజెన్సీలో సరసమైన ధరలకు ఐరన్ కడ్డీలు, రేకులు సీట్లు, ఐరన్ పైపులు, వాటర్ ట్యాంక్‌లు, పారలు, గోళాలు లభింస్తాయని దుకాణం యజమాని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏజెన్సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కడప ఉమ్మడి జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం(డిటిసి)లో దేహదారుఢ్య పరీక్షలను గురువారం కొనసాగాయి. ఎస్పి వి.విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్ మెంట్, ఫిజికల్ ఎఫిషియన్సి టెస్ట్‌లకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి రమణయ్య, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డిపిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరుగు పందెంలో అభ్యర్థులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -వల్లూరు

పాఠశాల కమిటీ చైర్మన్లు పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి పుత్త విజయరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలు అనే విషయం గురించి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పాఠశాల కమిటీ చైర్మన్లు, కమిటీ సభ్యులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పాఠ శాల అభివృద్ధి కమిటీలు తమ పరిధిలోని పాఠశాలలు బలోపేతం చేసు కోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సురేష్ బాబు ఉపాధ్యాయులు సి. వి సురేంద్ర, ఎస్.శివరామరాజు, శివశంకర్, ఎంఆర్సి సిబ్బంది ఓబయ్య, రాజా, విశ్వనాథ్, శైలజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి

నేడు ఏకసభ్య కమిషన్ జిల్లాకు రాక

ప్రజాశక్తి - కడప : షెడ్యూల్ కులాలలోని ఉప వర్గీకరణపై విచారణ చేయడానికి ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ శుక్రవారం జిల్లాకు రానున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3ర ఉదయం.7.30గం.లకు కర్నూలు నుండి రోడ్డు మార్గం ద్వారా బయల్దేరి ఉదయం.10.30 గంటలకు జిల్లాకు చేరుకుంటారని, ఉదయం.11.00 గంటల నుండి మధ్యాహ్నం.2.00 గంటల వరకు జిల్లా యంత్రాంగంతో సమావేశం నిర్వహించడంతో పాటు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న సభా భవనంలో వివిధ ఉప కుల సభ్యులు, సంఘాలతో వినతి పత్రాలను స్వీకరిస్తారు.

ఎక్స్ గ్రేషియా అందజేత

ప్రజాశక్తి - కడప అర్బన్ : విధినిర్వహణలో మరణించిన షేక్.మొహమ్మద్ షఫీవుల్ల భౌతిక కాయాన్ని ఎపి వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టిడిపి నాయకులు అమీర్ బాబుతో కలిసి గురువారం కడప రవీంద్ర నగర్ లోని వారి నివాసానికి వెళ్లి నివాళి అర్పించారు. అనంతరం వక్ఫ్ బోర్డ్ తరపున లక్ష రూపాయల ఎక్స్ గ్రేషియాను కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుంబ సభ్యులు కోరుకుంటే వారికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని భరోసా కల్పించారు. ఎప్పుడు ఎటువంటి సమస్య ఎదురైన తమకు ఫోన్ చేయాలని సూచించారు.వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ మెంబర్ దావూద్ బాషా బాఖావి, వక్ఫ్ బోర్డ్ సిఇఒ అబ్దుల్ ఖాదిర్, కడప జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ గౌస్, జాఫర్ షరీఫ్, రియాజ్, అన్వర్, మైజుల్లా హుస్సేనీ, సమీర్ పాల్గొన్నారు.

విఆర్ఎ సంఘం అధ్యక్షుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గోపవరం

అనారోగ్యంతో బాధపడుతున్న ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశానికి ఆ సంఘం కడప జిల్లా కమిటీ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. గురువారం తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న నాగేశంను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విఆర్ఒలు చందాలు వేసుకుని సేకరించిన రూ. 10 వేలను మందులు, ఇతర వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, విఆర్ఒలు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-చెన్నూరు : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో ఈ నెల 5,6,7,8 తేదీల్లో నిర్వహించనున్నారని, జిల్లాలోని ఉపాధ్యాయులు, ప్రముఖులు హాజరై విజవయంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ తెలిపారు. రాష్ట్ర మహాసభల ఆహ్వాన కరపత్రాలను బాలికల ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు గంగిరెడ్డి, సునీత, రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమానికి ఉపాధ్యాయులకు దిక్సూచిగా పనిచేస్తున్న సంఘం యుటిఎఫ్ అని, అలాగే ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రభుత్వ బడుల బలోపేతానికి పనిచేస్తుందని చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా మాట్లాడుతూ యుటిఎఫ్ ప్రభుత్వ విద్యారంగానికి ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిని సమీక్షించుకొని రాబోయే 25 సంవత్సరాలు ఉపాధ్యాయ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, ప్రభుత్వ బడల బలో పేతం చేయడానికి ఈ స్వర్ణోత్సవ మహాసభలలో పలుకీలక నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాసులు చిన్నప్ప హేమలత శ్యామల మేరీ సునీత మధుసూదన్ ఖాదర్ వెంకటసుబ్బయ్య వెంకట శివుడు పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని తొగట వీర క్షత్రిక సంఘం కడప నగరశాఖ గౌరవాధ్యక్షులు సంగివాదం ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సన్మాన సభను ఈనెల 4న ఉదయం 10 గంటలకు ధర్మవరంలోని శివానగర్ శివాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చేనేత కులాలకు సంబంధించిన తొగటవీర క్షత్రియులు, పద్మశాలీలు, దేవాంగులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరం

- ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రుబియా

ప్రజాశక్తి-కడప సిటీ

చిన్నారులు ఎదుర్కొనే వ్యాధుల పట్ల అవగాహన అవసరమని ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ పి.బి. రుబియా అన్నారు. గురువారం కడప నగరంలోని ఐటిఐ సర్కిల్‌లోని ఎంఆర్ హాస్పిటల్లో చిన్నపిల్లల వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ రుబియా మాట్లాడుతూ చిన్నపిల్లలు కలిగిన తల్లిదండ్రులు పిల్లల అరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధుల బారిన పడిన వెంటనే సంబంధిత నిపుణుడైన వైద్యులను సంప్రదించాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన పాత రికార్డులను తీసుకురావాలని చెప్పారు. ఐటిఐ సర్కిల్ పరిసర ప్రాంతాల్లోని చిన్నారుల అరోగ్య సమస్యల పరిష్కారానికి అన్నివిధాలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తక్కువ ఖర్చులతో కూడిన వైద్య సేవలను అందిస్తామని తెలిపారు. ఐటిఐ సర్కిల్, ఊటుకూరు, భగత్ సింగ్ నగర్, చింతకొమ్మదిన్నె గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ ఇడి డాక్టర్ వి .బ్రహ్మయ్య, డాక్టర్ హిదాయతుల్లా , అరుణాచల హాస్పటల్ డాక్టర్ కరీముల్లా, ఆయిల్ మిల్ ఓబులేసు, టీచర్ అజ్మతుల్లా, హబీబుల్లా పాల్గొన్నారు.

చిన్నపిల్లల విభాగం ప్రారంభోత్సవంలో అతిథులు

సౌరవిద్యుత్ ప్లాంట్లకు గ్రీన్‌సిగ్నల్

- ఇంటింటికీ సౌర ఫలకాలు ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో 1.12 లక్షల దళితులకు లబ్ధి
- కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సౌర, పవన విద్యుత్ పాంట్ల ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో కడప జిల్లాలో సౌర, పవన్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందు లోభాగంగా జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లలోపు సౌర విద్యుత్‌ను వినియోగించుకునేందుకు అవసరమైన మేరకు సౌర విద్యుత్‌ను సరఫరా చేయనుంది. 200 యూనిట్లను మించితే రూ.2.03 వసూలు చేయనుంది. ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట, రాయచోటి, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలోని 20 సబ్‌డివిజన్లలో 1.12 లక్షల ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీరికి జగజ్జీవన్ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల మేరకు ఉచిత విద్యుత్ ప్రయోజనం లభిస్తోంది. రెండేళ్ల కిందట వైసిపి సర్కారు ఎస్‌సి, ఎస్‌టి దళిత కాలనీలకు మాత్రమే 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా ను పరిమితం చేసిన సంగతి తెలిసిందే. తాజా కేబినెట్ సమావేశం లో ఎస్‌సి, ఎస్‌టి విద్యుత్ వినియోగదారుల ఇళ్లపై సౌర ఫలకాలను ఏర్పాటు చేయడం ద్వారా మూడేళ్ల అనంతరం ఉచిత విద్యుత్‌ను వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే జిల్లాలోని వీరపునాయునిపల్లి, పెండ్లిమర్రి, కొండాపురం, ముద్దనూరు తదితర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాల్లో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తాజా కేబినెట్ సమావేశం నేప థ్యంలో మరికొన్ని ప్రాంతాల్లో పవన్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో అదనంగా సౌర, పవన విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, వాణిజ్య ప్రాతిపదికన విద్యుత్ ఉత్పత్తి చేసి సరఫరా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది.

నిరుద్యోగి భృతిపై మాట తప్పిన కూటమి ప్రభుత్వం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల ముందు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిపై కూటమి ప్రభుత్వం మాట తప్పడం శోచనీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించడం భావ్యం కాదన్నారు. గత ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చే దానికి ప్రధాన కారణం సూపర్ సిక్స్ హామీలన్నారు. ఇందులో యువతకు సంబంధించి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతోపాటు నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పారన్నారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పారన్నారు. టిడిపి చెప్పిన హామీలను యువత నమ్మి మూకుమ్మడిగా టిడిపి కూటమికి ఓట్లు వేయడంతో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించడం దుర్మార్గమన్నారు. 20లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం తక్షణం అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి జనవరి నుంచి అయినా అమలు చేయాలని కోరారు. మెగా డిఎస్‌సికి వెంటనే షెడ్యూల్ ప్రకటించి 16,347 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ-2 రామకృష్ణ

ప్రణాళికాబద్ధంగా పాఠశాల అభివృద్ధి

ప్రజాశక్తి - లింగాల

ప్రణాళికాబద్ధంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఇఒ-2 రామకృష్ణ సూచించారు. మండల పరిధిలోని పెద్దకుడాల జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన అన్ని పాఠశాల కమిటీ చైర్మన్‌లతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు చక్కగా బోధిస్తూ ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. బడి ఈడు పిల్లలు అందరిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసి చైర్మన్లు, ఎంఇఒ-1 శ్రీనివాసరెడ్డి, పరిశీలకులు రామిరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ సూచించారు. కస్తూర్బా పాఠశాలలో గురువారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి బయటి విద్యార్థులను పాఠశాలల్లో చేర్చాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణకు తోడ్పడాలని తెలిపారు. పాఠశాల పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, పారిశుధ్యం, మనబడి-మన భవిష్యత్తు, డొక్కా సీతమ్మ బడి భోజన పథకం, లింగ వివక్షత, విధులు-బాధ్యతలు వాటిపై అవగాహన కల్పించారు. పాఠశాల యజమాన్య కమిటీ ఎన్నికలు, విధులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు కృష్ణయ్య, రిజ్వానా, రాజశేఖర్, పాఠశాల ఎస్‌ఎంసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంపల్లె వాసి కువైట్‌లో మృతి

ప్రజాశక్తి - వేంపల్లె

శివకుమార్ (ఫైల్‌ఫొటో)

కుటుంబాన్ని పోషించుకునేందుకు ఉన్న ఊరు విడిచి దేశం కాని దేశం వెళ్లిన వేంపల్లె వాసి కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి బంధువులు వివరాలు మేరకు.. శగనలా శివ కుమార్ (38) అనే వ్యక్తి 18 ఏళ్ల క్రితం చక్రాయపేట మండలంలోని అద్దాలమర్రి గ్రామానికి చెందిన సుభాషిణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వేంపల్లెలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉన్నాడు. వీరికి సాయికుమార్, లోషన్ అనే ఇద్దరు కుమారులు. పిల్లలను, భార్యను పోషించుకునేందుకు ఎనిమిదేళ్ల క్రితం కువైట్ వెళ్లి, అక్కడ డ్రైవర్‌గా చేరాడు. అప్పుడప్పుడూ ఇక్కడికి వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం మళ్లీ కువైట్‌కు వెళ్లాడు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఉదయం శివకుమార్ కువైట్ నుండి భార్య సుభాషిణితో మాట్లాడిన కొన్ని గంటల తర్వాత గుండెపోటుతో శివకుమార్ మృతి చెందాడని సమాచారం వచ్చింది. కువైట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న శివకుమార్ భోజనానికి రాలేదని, ఇతరులను చూసి రావాలని శివకుమార్ షేక్ చెప్పడంతో ఆయన గది వద్దకు వెళ్లి పిలిచినా పలుకలేదు. గది తలుపులు పగులగొట్టి వెళ్లి చూడగా మంచంలో నిద్ర పోతున్నట్లు ఉన్నాడు. పిలిచిన స్పందించకపోవడంతో అక్కడే ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని బంధువులు పేర్కొన్నారు. తమతో ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి కొన్ని గంటల్లోనే గుండెపోటుతో మృతి చెందడంతో భార్య పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శ్రీరాంనగర్ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

5న హాకీ బాలుర జూనియర్, సబ్ జూనియర్ ఎంపికలు

- హాకీ కడప జిల్లా సెక్రటరీ ఎం.శేఖర్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైఎస్ఆర్ కడప జిల్లా బాలుర జూనియర్, సబ్ జూనియర్ హాకీ జట్ల ఎంపికలు ఈ నెల 5న పులివెందుల వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో ఉదయం 9 గంటల నుంచి జరుగనున్నట్లు హాకీ కడప జిల్లా సెక్రటరీ ఎం.శేఖర్ తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మదనపల్లిలో జరగే 14వ రాష్ట్రస్థాయి బాలుర సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా 2009 జనవరి ఒకటి తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. జూనియర్ విభాగంలో ఎంపికైన బాలుర జట్టు ఈ నెల 2వ వారంలో కాకినాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని, ఇందులో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే జూనియర్, సబ్ జూనియర్ క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికేట్ తీసుకొని ఈ నెల 5న ఉదయం 9 గంటలకు పులివెందులలోని స్పోర్ట్స్ అకాడమీలో హాకీ కోచ్ రవికి రిపోర్ట్ చేయాలని సూచించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సిఎంఆర్‌ఎఫ్‌తో పేదలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సిఎంకు వివరిస్తున్న గజ్జల గోవిందు

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేద ప్రజలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును టిడిపి నాయి బ్రాహ్మణ కడప పార్లమెంట్ అధ్యక్షుడు గజ్జల గోవిందు కోరారు. గురువారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ 2025 నూతన సంవత్సరంలో సిఎం చంద్రబాబు తన మొదటి సంతకం నిరుపేదల సేవా కోసం సిఎంఆర్‌ఎఫ్ ఫైల్‌పై చేశారన్నారు. ఈ సంతకంతో 1,600 మంది నిరుపేదలకు రూ.24 కోట్ల సాయం అందనుందని తెలిపారు. ఇది పేదల ప్రభుత్వమని తెలిపారు. బద్రి, హరికృష్ణ, విశ్వం, సాయి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రచ్చుమర్రి పల్లి గ్రామంలో గురువారం ఆయన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులు ఈనెల 8 వరకు కొనసాగుతాయని తెలిపారు. అనంతరం రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలిస్తున్న తహశీల్దార్ నజీర్ అహ్మద్

కడప-కర్నూలు జాతీయ రహదారిని కమ్ముకున్న పొగమంచు

రోడ్లను కమ్మేస్తున్న పొగమంచు

ప్రజాశక్తి - చాపాడు

రెండు రోజుల నుంచి పొగమంచు అధికమైంది. ఉదయం వేళ రహదారులు ఏమాత్రం కనిపించకుండా పొగమంచు కమ్మేస్తుంది. గురువారం అధికంగా పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటల వరకు కూడా పొగ మంచు రోడ్ల వెంబడి కనిపిస్తూ వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. కనీసం రెండు మీటర్ల దూరం కూడా కనిపించనంత దట్టంగా అల్లుకుంది. గత వారంలో తుపాను తాకిడితో చలిగాలులు వీస్తే, ప్రస్తుతం పొగ మంచు అధిక మైంది. చాలా ఇబ్బంది కరంగా ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు.

నేడు చాపాడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి టి.లక్ష్మమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వీరకిషోర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతున్నారని తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో నిర్వహించే సమావేశానికి అధికారులు తమ పూర్తిస్థాయి నివేదికతో రావాలని ఆయన సూచించారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలో గుర్తించిన సమస్యలను సమావేశం దృష్టికి తేవాలన్నారు. ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరుకావాలని, వారి కుటుంబ సభ్యులు, ఇతరులకు ప్రవేశం లేదని తెలిపారు. అధికారులు ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరు అయితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ హెచ్చరించారు.

ప్రపంచ నాస్తిక మహాసభలకు పల్లవోలు రమణ

ప్రజాశక్తి - చాపాడు

విజయవాడలో ఈనెల 4, 5తేదీల్లో జరిగే ప్రపంచ నాస్తిక సభలకు భారత నాస్తిక సమాజం నాయకులు పల్లవోలు రమణకు విజయవాడ నాస్తిక కేంద్రం డాక్టర్ సమరం ఆహ్వానం పంపారు. ఆ మేరకు రమణ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పధాన్ని ప్రజల్లో పెంపొందించాలనే అంశంపై డాక్టర్ బ్రహ్మారెడ్డి, గుజరాత్‌కు చెందిన ప్రొఫెసర్ హిప్పు సాక్‌నాథన్ ప్రసంగిస్తారని తెలిపారు. మానవ హక్కులు, సెక్యులరిజం, నాస్తిక విలువలు అనే అంశంపై మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శంషుద్దీన్, చండీగఢ్ నుంచి రంజిత్ సింగ్, డాక్టర్ బెనర్జీ, సెక్యులర్ సోషల్ వర్క్ అనే అంశంపై ఆర్ సూయిజ్, సత్యనారాయణ, సంస్కార్ సంస్థ నుంచి జి సకల, నాస్తివాదం-ప్రజాస్వామ్యం అనే అంశంపై జెవివి డి ఎన్ ప్రసాద్, హన్మంతరావు ప్రసంగిస్తారన్నారు. యువతలో ప్రజా స్వామ్య విలువలు, శాస్త్రీయ దృక్పథం యువత పాత్ర అంశంపై మాజీ ఐఎఎస్ జయప్రకాష్ నారాయణ, డాక్టర్ వి.నారాయణ రావు, డాక్టర్ శ్రావణ కుమార్, శ్యాం సుందర్, రజిత గోరా, హసిల్ గోరా ప్రసంగిస్తారని వివరించారు. ఈ సభల్లో ఇతర దేశాల నుచి పముఖ నాస్తికులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

చౌక దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల వ్యాప్తంగా చౌక దుకాణాలు నిర్వహించుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తహశీల్దారు శోభన్‌బాబు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో తహశీల్దార్ మాట్లాడుతూ ఎర్రగుంట్ల మండలంలో 25 చౌక దుకాణాలకు అర్హులైన, ఆసక్తిగల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఇంటర్మీడియట్ పాసై ఉండాలన్నారు. పట్టణంలో 7 చౌక దుకాణాలకు గ్రామాల్లో చిలంకూరులో మూడు, కోడూరు, సున్నపురాళ్లపల్లె, పోట్లదుర్తిలో రెండేసి చొప్పున పెదనపాడు తుమ్మలపల్లె, నిడ్జి, పి.వెంకటాపురం, ఇల్లూరు, కలమల్ల, గ్రామాల్లో ఒక్కొటి ప్రకారం చౌక దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయసు వరకు ఉండేవారు కేటాయించిన రిజర్వేషన్లను చూసుకొని దరఖాస్తు చేసుకో వాలన్నారు. ఈనెల 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత పొందిన అభ్యర్థులకు చౌక దుకాణం తీరుతెన్నులు, పంపిణీ వ్యవస్థను ఎలా నిర్వహించాలి అనే దానిపై ఈనెల 17న రాత పరీక్ష ఉంటుందన్నారు. ప్రజలచే ఎన్నికైన, నామినేటెడ్ పదవులు కలిగిన, క్రిమినల్ కేసులు ఉన్నవారు అనర్హులని వివరించారు.

చాపాడు : మండల పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ షాపులకు నూతన డీలర్లను నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తహశీల్దార్ రమాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో విశ్వనాథపురం (ఎస్సీ మహిళ), లక్ష్మీపేట (ఓసి), కేతవరం(బీసీఏ మహిళ), వీరభద్రపురం (ఓసి), సీతారామపురం (ఎస్సీ), చాపాడు (ఎస్టీ మహిళ), మొర్రాయపల్లి (బిసిబి), ఓబులరెడ్డి పేట (ఓసి), పల్లవోలు (బిసి డి), నాగులపల్లె (బిసి), ఖాదర్‌పల్లె (బీసీఏ), నక్కలదిన్నె (ఈడబ్ల్యుఎస్), తిప్పిరెడ్డిపల్లి (ఎస్సీ మహిళ), రాజువారిపేట (ఎస్టీ), వెదురూరు (ఓసి), రాజుపాలెం (ఎస్సీ), టిఒ పల్లె (ఓసి) మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అన్నవరంలో మొక్కల పెంపకం

ప్రజాశక్తి - చాపాడు

పర్యావరణ పరిరక్షణ-పచ్చదనం పెంపులో భాగంగా గురువారం అన్నవరం గ్రామ పంచాయితీ ఎస్సీ కాలని వద్ద మొక్కలు నాటారు. పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మొక్కల నిర్వహణ ప్రజలకే అప్పగించారు. కెసి కెనాల్ 10వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ సంద్యాల లోకేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ ఆలూరు పీరయ్య, అమీర్, జయచంద్ర, ఉదయ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న అన్నవరం సుధాకర్‌రెడ్డి

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

కత్తెర పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మొక్కజొన్న పంటలో కత్తెర, మొవ్వ పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి రైతులకు వివరించారు. యామవరం గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 85 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేసినట్లు తెలిపారు. ఈ పంటలో కత్తెర పురుగు(ఫాల్ ఆర్మీ వార్మ్) నివారణకు ఇమామెక్టిన్ బెంజిట్ అనే మందును 0.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మొవ్వ పురుగు ఆశించకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. మొవ్వ పురుగు ఆశిస్తే పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయన్నారు. మొవ్వ పురుగు ఆశిస్తే మొవ్వలను పట్టుకుని పీకితే సులువుగా ఊడుతుందన్నారు. మొవ్వలో ఉండే ఆకును పరిశీలిస్తే లోపల పురుగు ఉధృతి కనిపిస్తుందన్నారు. దీని నివారణకు కార్బోఫ్యురాన్ 3జి గుళికలను ఎకరానికి 3కిలోల ప్రకారం ఇసుకలో కలిపి సుడుల్లో వేసుకోవాలని సూచించారు. పొలంలో కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

డ్రం సిడర్ పద్ధతిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి, అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం మండల పరిధిలోని కేతవరం, అల్లాడుపల్లె గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేతవరానికి చెందిన రైతు శ్రీనివాసులు రెడ్డి పొలంలో డ్రం సీడర్ పద్ధతిలో వరి విత్తడం సాగు చేయడానికి పరిశీలించారు. అనంతరం ఎడిఎ మాట్లాడుతూ డ్రం సీడర్ పద్ధతిలో ఎకరాకు 8కిలోల విత్తనం మాత్రమే సరిపోతుందన్నారు. రైతుకు నారు మడి ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా నూతన పద్ధతులను అలవర్చుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మ్యాగీ, గోపిరామ్, రైతులు పాల్గొన్నారు.

గేట్, సివిల్స్ ఫౌండేషన్ కోర్సులను ప్రారంభించండి

ప్రజాశక్తి - వేంపల్లె

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవి ద్యాలయ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటిల్లో గేట్, సివిల్స్ ఫౌండేషన్ కోర్సులను ప్రారం భించాలని ప్రజాసత్తా జాతీయ అధ్యక్షులు పుల్లగూర శోభన్‌బాబు కోరారు. గురువారం ఇరుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తాకు వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవ త్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గేట్, సివిల్స్, స్కిల్ డెవలప్‌మెంట్, బ్యాంకింగ్ కోర్సులకు లాంగ్ టర్మ్ ఫౌండేషన్ తరగతులు నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు మౌలిక వసతులు, రుచి, శుచి కలిగిన భోజనం, వసతిగృహాల్లో శుభ్రతకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మంచి వాతావరణాన్ని కల్పించాలని కోరారు. ఉత్తమ బోధనతోపాటు ఎన్‌ఎస్‌ఎస్, స్పోర్ట్స్ ఒకే షనల్ కోర్సులకు ప్రాధా న్యత కల్పించాలమన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, డీన్ అకాడమిక్ రమేష్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ రత్నకుమారి పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించండి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

ఎపిఎస్‌పిడిసిఎల్ అక్రమాలపై విచారణ జరపాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే రాంగోపాల్‌రెడ్డి లేఖ రాశారు. ఫైర్డ్‌ఎడ్జ్ క్లామ్స్ కొనుగోలులో అవినీతి, అక్రమాలు, ప్రజాధనం దుర్వినియోగం చేశారన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై రూ.కోట్లు స్వాహా చేస్తున్నారని, వీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం లేకున్నా, సృష్టించి దోపిడీ చేస్తున్నరన్నారు. వీటి విషయం ఎవరికీ సరిగా తెలియని పరిస్థితులలో అత్యంత ఎక్కువ ధరకు కొటేషన్లు తెప్పించి, వీటి ధర ప్రకారము కొనుగోలు కమిటీలో అనుమతి తీసుకుని, దోపిడీకి తెర లేపారన్నారు. మార్కెట్లో ఉన్న ధర కంటే అయిదు నుంచి పది రెట్లు టెండర్ అధికంగా వేసుకుని దోపిడి చేస్తున్నరని తెలిపారు. ఈ పనులు చాలా అత్యవసరం, త్వరగా పనులు చేయాలని జిల్లాలలో ఉన్న కన్స్ట్రక్షన్ డివిజన్ అధికారులతో ఒక రిపోర్ట్ సిద్ధం చేయించి, ఈ రిపోర్ట్ జిల్లా అధికారి అయిన ఎస్‌సి సిఫారసు చేయించి, కోట్ల రూపాయల విలువైన ఈ పనులు ఒక్కొక్క అగ్రిమెంట్ విలువ రూ.ఐదు కోట్ల లోపు వచ్చేలా (ఐదు కోట్లు దాటితే విద్యుత్ నియంత్రణ మండలి వారి ముందస్తు అనుమతి, వీటికి ఈ-టెండర్ తప్పనిసరి కాబట్టి) చేసి ఒక్కొక్క అగ్రిమెంట్ ను విడివిడిగా ప్రస్తుతము ఉన్న వేరే అగ్రిమెంట్లలో నేరుగా కలిపేస్తూ కోట్లాది రూపాయలను అందరూ కలిసికట్టుగా దోపిడి చేస్తున్నారు. కాంట్రాక్టర్ వీటి కొనుగోలుకు మామూలుగా మార్కెట్ విలువ రూ.200లు ఉన్న వాటికి రూ.1000 నుంచి రూ.1200లు కొటేషన్లు వేసుకుని భారీగా అక్రమాలు జరిగాయని వీటిపై పూర్తి విచారణ చేయించాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE : KADAPA

(In the matter of granting permission to sell the property of the share of the minors namely Suruph Shakib Ali Khan, minor boy, aged about 15 years & Suruph Safrin, minor girl, aged about 9 years)

G.O.P. No.67/2024

1.Suruph Shakib Ali Khan, minor boy, aged about 15 years, Indian Muslim, (Aadhaar No.9960 6164 7401)
2.Suruph Safrin, minor girl, aged about 9 years, Indian Muslim, (Aadhaar No.4937 3460 5544)
Rep. by their father, natural guardian Suruph Yunus Ali Khan, S/o Suruph Abdul Hamed Khan, Aged 46 years, Indian Muslim, R/at D.No.11/754-1, Habibulla Street, Kadapa City, Y.S.R. District (Aadhaar No.8487 8159 1443).

...Petitioners

Versus

Nil. **...Respondent**

GENRAL NOTICE TO WHO IT MAY CONCERN

Whereas the petitioners filed the above G.O.P. for grant of permission to sell the share of minors 1) Suruph Shakib Ali Khan and 2) Suruph Safrin out of schedule mentioned property and if anyone having any kind of objection in respect of alienating share of minor's out of petition schedule property, they are here by instructed to present before the Hon'ble Court on 20-01-2025 at 10:30 A.M. sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

SCHEDULE

Kadapa Division, Kadapa Rural-Sub-Division, Palampalli Village fields,Palampalli, Sarcar Punji D.No.631/B1/B, Kadapa Municipal Corporation Area Limits, Agricultural Land to an extent of Ac.0.50 cents bounded with:

Boundaries :

East : Land in Survey No.631/B2/B1, West : Field of Chinna Machupalli village, North : Land of Yusuf Ali Khan, South: Land of Shaik Basha Mohiddin in same Survey number.

1/5th share out of total extent of Ac.0.50 cents i.e. Ac.0.10 Cents

//By order of the Hon'ble Court//

G. TRIVIKRAM SINGH
Advocate, KADAPA.
Mobile No: 98667 90979.

బ్రహ్మంగారి సన్నిధిలో చిత్తూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని గురువారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్సీ దొరబాబు, చూడా చైర్మన్ కటారి హేమలత వారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్యాచారి, పూర్వపు మఠాధిపతి కుమారుడు శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఫొటోలు, కాలజ్ఞానం పత్రులను, చరిత్ర పుస్తకాలను వారికి అందజేశారు. అనంతరం జగన్మాత శ్రీఈశ్వరిదేవి అమ్మవారిని ఈశ్వరి మఠం యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పలికి తీర్థప్రసాదం అందజేశారు. ఆయన రాకతో స్థానిక మండల తెలుగుదేశం అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నాయకులు సాంబశివారెడ్డి, పూజ శివ యాదవ్, వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రమాదకరంగా అండర్ పాస్ వంతెన

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని పూసల కొట్టాల సమీపంలో కడప-కర్నూలు జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాస్ వంతెన ప్రమాదకరంగా ఉంది. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వంతెన మార్గం కింద ఇరువైపులా పెద్దపాటి గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి ఉండటంతో గుంతలు మరింత లోతుగా తయార య్యాయి. ద్విచక్ర వాహనదారులు గుంతలను గుర్తిం చలేక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మరి కొందరు వాహనదారులు నేరుగా వెళ్లే క్రమంలో వాహన చక్రాలు గుంతల్లో పడడంవల్ల వాహనాల్లో ప్రయాణించే వారు గాయాల పాలవుతున్నారు. ఈ మార్గంలో ప్రతినిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. విద్యార్థులు సైకిళ్లపై పాఠశాలలకు వెళుతుంటారు. విజయవాడ, నెల్లూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్ల భవనాల శాఖ అధికారులు, జాతీయ రహదారి విభాగ అధికారులు ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తున్నా వారు మరమ్మతుల గురించి పట్టించుకోవడంలేదనే విమర్శలు న్నాయి. అధికారులు స్పందించి అండర్ పాస్ వంతెన కింద ఏర్పడిన గుంతలను పూడ్చి, ప్రమా దాల నివా రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మురుగు కాలువలను తలపిస్తున్న వీధులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేకంగా ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తున్నా నిధులు ఖర్చవుతున్నాయే తప్ప.. గ్రామాల్లో ఏ మాత్రం అభివృద్ధి కనిపించడంలేదు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ వంటి అవసరాల కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ ఉంటుంది. ఒక్కోసారి ప్రత్యేకంగా ఎంపీ నిధులను కూడా పంచాయతీల అభివృద్ధికి కేటాయిస్తుంటారు. గ్రామ పంచాయతీల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నా పురోగతి మాత్రం కనిపించలేదు. ఏళ్ల తరబడిన సిమెంట్ రహదారులు ఇప్పటికీ గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. అవి దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. కొత్త రోడ్లకు నోచుకోవడంలేదు. వివరాల్లోకెళితే.. మేజర్ పంచాయతీ ఖాజీపేట టీచర్స్ కాలనీలో సిమెంట్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీధులన్నీ ఇరుకుగా మారాయి. డ్రయినేజీ వ్యవస్థ లేదు. వర్షాకాలంలో నీరు బయటికెళ్లేందుకు తగిన ఏర్పాటు లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నెలల తరబడి నిల్వ ఉంటోంది. పంచాయతీకి తగిన ఆదాయం సమకూరుతున్నా మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు మాత్రం అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారు. పన్ను వసూళ్లపై ఉండే శ్రద్ధ అభివృద్ధిపై ఎందుకు చూపడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. మండల పరిధిలోని పత్తూరు గ్రామంలో పారిశుధ్య సమస్య వెంటాడుతుంటుంది. ఏ వీధి కెళ్ళి చూసినా మురుగు కాలువలు ఒకటి లేవు. వర్షాకాలంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. మురుగు కాలువలు ఏర్పాటు చేయకపోవడం వల్ల పారిశుధ్య సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి పారిశుధ్య సమస్య తలెత్తకుండా మురుగు కాలువలు ఏర్పాటు చేయడంతోపాటు నూతన సిమెంట్ రహదారులు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పత్తూరులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు